క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 33/11 కేవీ శెట్టిగుంటరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను మారుస్తున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని విద్యుత్‌శాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అరవిందనగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, సింహపురి కాలనీ, మైపాడు రోడ్డు, వేణుగోపాల్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెడికవర్‌లో ఉచిత కేన్సర్ పరీక్షలు



నెల్లూరు(అర్బన్) : నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు ఉచితంగా గర్భాశయ ముఖ ద్వారపు (సర్వైకల్) కేన్సర్ పరీక్షలను ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కేన్సర్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను నగరంలోని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా ఆమె నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత కన్సల్టేషన్‌తో పాటు రూ.5,100 విలువైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నామన్నారు. సర్వైకల్ కేన్సర్ రాకుండా ముందస్తు టీకా కూడా అందుబాటులో ఉందన్నారు. ఈ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌బాబు, పీఆర్వో చందువర్మ, ఎమ్మెల్యే కుమారుడు అర్జున్‌రెడ్డి, టీడీపీ నేత రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ స్టేడియంలో పలువురు క్రీడాకారులను ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు మాట్లాడారు. ఎస్జీఎఫ్ సబ్ జూనియర్స్ ఆర్చరీ రాష్ట్ర స్థాయి పోటీల్లో మిక్స్‌డ్ విభాగంలో సాయిమౌర్య స్వర్ణ పతకాన్ని సాధించారని చెప్పారు. అనంతరం సీనియర్స్ బాలుర రికర్వ్ రౌండ్‌లో నేషనల్ గేమ్స్‌కు ఎంపికైన తరుణీష్ జాత్యా, సాయిమౌర్య, ఇండియన్ రౌండ్‌లో ఎంపికైన వెంకటలోకేష్, సాత్విక్‌ను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్‌లు భరద్వాజరెడ్డి, శివశంకర్, దివి ప్రకాష్, హారతి, సాయికిరణ్, జయశంకర్, నాటి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పసుపులేటి రామ్మూర్తిని సన్మానించారు. డీఎస్డీఓ యతిరాజ్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనం మహేశ్వర్‌రెడ్డి, గురుప్రసాద్, గాదం శ్రీనివాసులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాలు.. జోరు విక్రయాలు

- నగరంలో ఫుట్‌పాత్ దుకాణాలు
- తక్కువ ధరకే దుస్తులు, ఇతర వస్తువుల విక్రయాలు
- ఆసక్తి చూపుతున్న సామాన్యులు

సాధారణంగా దుస్తులను కొనాలంటే పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, షోరూమ్‌లు గుర్తుకొస్తాయి. పండగ సీజన్‌లో మరీ జోరుగా విక్రయాలు జరుగుతాయి. ఇక్కడ తక్కువ ధరలో దొరికే దుస్తులతో పాటు చెప్పులు, షూలు, ఇతర వస్తువులను సామాన్యులు అధికంగా కొనుగోలు చేస్తున్నారు.


చిరు వ్యాపారి వద్ద కొనుగోలు చేస్తున్న మహిళలు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై వివిధ రకాల దుస్తులు, వస్తువుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. డిసెంబరు నుంచి జనవరి వరకూ పండగల సీజన్‌లో ఇవి మరిన్ని ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా మెయిన్‌రోడ్డు, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, మినీబైపాస్ రోడ్డు, కాపువీధి తదితర ప్రధాన ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లపై దుస్తులతో పాటు చెప్పులు, షూస్, వివిధ రకాల ఫ్యాన్సీ వస్తువులు, బొమ్మల విక్రయాలు జరుగుతున్నాయి. మహిళలకు కావాల్సిన వివిధ రకాల దుస్తులు, టాప్స్, చిన్నపిల్లల దుస్తులు, చెప్పులు, గాజులు, వాచీలు, బ్యాగులను ఫుట్‌పాత్‌లపై విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి పేద, మధ్య తరగతి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నెల్లూరు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి మరీ కొనుగోలు చేస్తున్నారు.

సందడి వాతావరణం

నగరంలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలైన మెయిన్ రోడ్డు, ట్రంకురోడ్డు, కాపువీధి, చిన్నబజార్, స్టోన్‌హౌస్‌పేట, మినీబైపాస్ రోడ్డు వంటి ప్రాంతాలు సంక్రాంతి పండగ నేపథ్యంలో కొనుగోలుదారులతో సందడిగా మారాయి. వీటితో పాటు వస్త్ర వ్యాపారానికి పేరుగాంచిన కాపువీధి, రేబాలవారివీధిలోని క్లాత్‌మర్చంట్, సండేమార్కెట్, జీఎస్టీ రోడ్డు తదితర ప్రాంతాలు పండగ సీజన్‌లో కిటకిటలాడుతున్నాయి.

ట్రాఫిక్ సమస్య

ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లలో వస్తున్న కొనుగోలుదారులతో నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో పాటు, షాపింగ్ మాల్స్‌కు వచ్చే వాహనాలను సైతం రోడ్డు పక్కనే నిలపాల్సి వస్తోంది.

తక్కువ ధరకే దొరుకుతున్నాయి



షాపుల్లో కొనుగోలు చేసిన వస్త్రాల ధరలతో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకే దొరుకుతున్నాయి. వివిధ రకాల రంగులు, డిజైన్లతో పాటు నాణ్యత కూడా బాగుంది. చిన్న పిల్లల దుస్తులు బాగా ఆకట్టుకుంటున్నాయి. షూస్, హ్యాండ్‌బ్యాగులు అందుబాటు ధరలకే లభిస్తున్నాయి.

– అశోక్, కొనుగోలుదారుడు

ఎంతో మేలు



ఇక్కడ దొరికే రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరకే దొరకడం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు. షాపుల్లో ఉన్న నాణ్యతే ఇక్కడ కూడా ఉంటుంది. షోరూం వారు ట్యాక్స్‌లు వేసుకుని అధిక ధరకు విక్రయిస్తుంటారు. ఫుట్‌పాత్‌లో అయితే అవేమి ఉండవు. అందుకే అన్నిరకాల వస్తువులు తక్కువ ధరకే లభిస్తున్నాయి.

– రమణారెడ్డి, కొనుగోలుదారుడు



సండే మార్కెట్‌లో ఫుట్‌పాత్ వద్ద ఉన్న చిరు దుకాణాల వద్ద జోరుగా సాగుతున్న దుస్తుల విక్రయాలు

నిబంధనలు తప్పక పాటించాలి


మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నెల్లూరు సిటీ : వాహనదారులు తప్పక నిబంధనలు పాటించాలని ఎంవీఐ పూర్ణచంద్రరావు అన్నారు. నగరంలోని ఆర్టీసీ వన్‌డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంవీఐ పూర్ణచంద్రరావు హాజరై, మాట్లాడారు. ఆర్టీసీ డిపోలో పనిచేసే డ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. గ్యారేజీలో పనిచేసే కార్మికులు ప్రతిరోజు బస్సుల టైర్లు, బ్రేకుల కండీషన్, బస్సు అద్దాలు, లైటింగ్ సిస్టమ్ తదితర వివరాలను పరిశీలించుకుని డిపో నుంచి బస్సులను బయటకు పంపాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ఆల్కహాల్ సేవించి వాహనాలను నడపరాదని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ గ్యారేజీ సిబ్బంది, అన్ని విభాగాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే పక్కాగా జరగాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కుష్టు(లెప్రసీ) వ్యాధి సర్వేను పక్కాగా నిర్వహించాలని లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ అన్నారు. నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉన్న ఎన్టీఆర్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కుష్టు సర్వే ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించాలని తెలియజేశారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తిస్తే వ్యాధి నయం అవుతుందన్నారు. నగరంలోని ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టు వ్యాధి కోసం తగినన్ని మందులు ఉన్నాయన్నారు. 14 రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, వైద్యులు పర్వీన్, కల్యాణ్, సుభాషిణి, బీవీ శేషయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పర్యవేక్షించండి

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను సచివాలయ కార్యదర్శులు ప్రతిరోజు పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక తడికల బజార్ కూడలిలోని అన్న క్యాంటీన్‌లో భోజన నాణ్యత, తాగునీరు, వంటశాల నిర్వహణ తదితర అంశాలను గురువారం రాత్రి కమిషనర్ పరిశీలించారు. సచివాలయ అమెనిటీస్, మహిళా పోలీస్ కార్యదర్శులు ప్రతిరోజు తనిఖీ చేసి ఆహార నాణ్యత, మోతాదు తదితర అంశాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని, నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేయాలని ఆదేశించారు. క్యాంటీన్ ప్రాంగణాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతిరోజు పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేపట్టాలని సూచించారు. ఆహారం సరఫరాకు అవసరమైన అదనపు వాహనాలు, సిబ్బందిని నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఇందుకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేదా ఇతర వివరాలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఇతర విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


తడికల బజార్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

‘సూర్యఘర్’పై విస్తృత ప్రచారం చేపట్టాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకంపై అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో నెల్లూరు టౌన్, రూరల్ డివిజన్ల విద్యుత్ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వినియోగంపై దృష్టి సారిస్తోందని, అందులో భాగంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. ఇంటి అవసరాలకు తగినట్లు సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ పొందాలని వివరించారు. దీని ద్వారా సబ్సిడీ కూడా అందుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఈ పథకం ద్వారా పూర్తి ఉచితంగా సౌర వెలుగులు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు కింద ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చు భరిస్తాయన్నారు. లబ్ధిదారులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారని, అయితే ఈ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ టౌన్, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, కన్‌స్ట్రక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ల విభాగాల ఈఈలు పరంధామయ్య, లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అశోక్, సునీల్, కిరణ్, భానునాయక్, రాము, మునీంద్ర, సోలార్ వెండర్స్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్


తీరంలో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ప్రతిమలు



నదిలో గొబ్బెమ్మలను కలిపి మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

పెన్నాతీరం.. భక్తజనపరవశం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పెన్నా తీరం గురువారం భక్తజనసంద్రంగా మారింది. కుల మతాలకు అతీతంగా ప్రజలు ఏటి పండగకు తరలి రావడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తిశ్రద్ధలతో పూజించిన గొబ్బెమ్మలను(గౌరమ్మలను) మహిళలు ఊరేగింపుగా పవిత్ర పినాకిని తీరానికి తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఈ మేరకు పెన్నా తీరంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేవతా మూర్తుల ప్రతిమలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రైల్వే పనులతో మరింత రద్దీ

రంగనాయకులపేట పాతచెక్ పోస్టు రైల్వేగేట్ దగ్గర అండర్‌బ్రిడ్జి పనులు సాగుతుండడంతో నగరంలోని తూర్పువైపు నుంచి ప్రజానీకం వచ్చేందుకు మార్గం లేకుండాపోయింది. దీంతో పినాకిని తీరానికి వచ్చేందుకు శెట్టిగుంటరోడ్డు రంగనాయకులపేట రైల్వేగేట్ దగ్గర నుంచి గోపురంవీధి ఒక్కటే మార్గమైంది. దీంతో కోవూరు నుంచి వచ్చే ప్రజానీకం బ్యారేజీ మార్గం గుండా రాకపోకలు సాగించడంతో పెన్నా బ్యారేజీ, గోపురం వీధి, రంగనాయకులపేట పరిసర ప్రాంతాలతో పాటు పెన్నా తీరం మరింత రద్దీగా మారింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.


దేవతామూర్తులను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు


అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





ప్రత్యేకాలంకరణలో దేవతా ప్రతిమలు


చిన్నారుల కోలాట ప్రదర్శన